# ఇది తీయని వెన్నెల రేయి.. సిలికాన్ వేలీలో 'సత్యం' స్వరాంజలి

-- **రమణ ఈడూరి**, సిలికాన్ వేలీ, క్యాలిఫోర్నియా (జూన్ 6, 2009)

జూన్ 6, శనివారం రాత్రి సన్నీవేల్ నగరంలో (పున్నమికి ఒక రోజు ముందర) గుడి బయటనే కాకుండా లోపలకూడా నిజంగా వెన్నెల కురిసింది! తెలుగు చలన చిత్ర సంగీత ప్రపంచంలో ఎన్నెన్నో మధురమైన పాటలకి స్వరాలు సమకూర్చిన అలనాటి ప్రముఖ సంగీతదర్శకుడు సత్యం గారికి, సిలికాన్ వేలీలో స్వరనివాళి కార్యక్రమం నిర్వహించబడింది.

మూడు గంటలపాటు సాగిన ఈ స్వర మంత్రజాలం దాదాపు వెయ్యిమంది **ప్రేక్షక శ్రోతల్ని** ౩౦ సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్ళింది. అమెరికాలోని బే-ఏరియాలో **బాటా, చిమట మ్యూజిక్** సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఎన్నో విధాలుగా ప్రత్యేకతని సంతరించుకుంది. ప్రవాసాంధ్ర సంస్థలు ఒక తెలుగు సంగీత దర్శకుడికి నివాళిగా ఆయన పాడిన పాటలని ఆలపించడం ఒక ప్రత్యేకత. గాయనీ గాయకులంతా స్థానికులవడం ఇంకొక ప్రత్యేకత. వాయిద్య సంగీతాన్ని సమకూర్చిన కళాకారులంతా తమిళులవడం సంగీత ప్రపంచానికి ఎల్లలు లేవని మరోసారి నిరూపించింది. **కేవలం 'సత్యం' గారు స్వరపరచిన పాటలతోనే పూర్తి కార్యక్రమం విదేశాల్లో జరగడం బహుశ ఇదే మొదటి సారి కావొచ్చు.**

ఈ కార్యక్రమానికి సన్నిధి రెస్టారెంట్ (ప్లెజంటన్) వారు గ్రాండ్ స్పాన్సర్ గా మరియు రవి ట్యాక్స్, శ్రీ ట్రావెల్స్, చానెల్ రియల్ ఎస్టేట్ వారు కో-స్పాన్సర్లుగా వ్యవహరించారు. ప్రసాద్ మంగిన (బాటా ప్రెసిడెంట్), వీరు ఉప్పాల (బాటా బోర్డ్), చిమట శ్రీనివాస్ గార్ల ఆధ్వర్యంలో బాటా & చిమటమ్యూజిక్ కార్యకర్తలు చాలా చురుగ్గా ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఆసూరి విజయ గారు (బాటా బోర్డ్ & కల్చరల్ చెయిర్) వ్యాఖ్యాతగా ఆద్యంతం రక్తి కట్టించారు.

సాయంత్రం 6:30 నుండి రాత్రి 10:00 వరకు కార్యక్రమం కొనసాగింది. మొత్తం **26** ఆణిముత్యాలవంటి పాటలను ఎంచుకొని పాడారు. మరొక ముఖ్యాంశం ఏమిటంటే సుప్రసిద్ధ గాయకులు శ్రీ బాలసుబ్రహ్మణ్యం గారు మరియు ప్రముఖ **Guitar** వాద్యకారులు శ్రీ సాలూరి వాసు రావు గారు (ప్రఖ్యాత సంగీత దర్శకులు కీర్తిశేషులు సాలూరి రాజేశ్వరరావు గారి కుమారుడు) నిర్వాహకుల ప్రయత్నాన్ని హర్షిస్తూ ప్రత్యేకించి ఈ కార్యక్రమంకోసమే రికార్డింగ్ చేసి పంపించిన వీడియోలను విరామ సమయానికి ముందు, తరువాత ప్రదర్శించారు. అందులో వారిద్దరు శ్రీ సత్యంగారితో తమకు గల అనుబంధాన్ని అనుభవాల్ని ప్రేక్షకులందరితో పంచుకున్నారు. ఇంకొక ప్రత్యేకమైన ఆకర్షణ హాలు బయట పెట్టిన **Black and White Photos.** చిమట

శ్రీనివాసరావుగారు ఎక్కడినుండి తెచ్చారోగాని చాలా పాతవి అరుదైన సత్యం గారికి సంబందించిన ఫొటోలు ఎన్నో ఉన్నాయి. సత్యం గారు ప్రముఖ గాయనీగాయకులు, ఇంకా సంగీత దర్శకులు (ఉత్తరాదివారు కూడా) ఎందరితోనో కలిసి దిగిన ఫొటోలు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ కన్నులవిందు కలిగించాయి.

ముందుగా విజయ ఆసూరి గారు వేదికపైకి వచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యంగారి Background ని ప్రేక్షకులకు పరిచయం చేస్తూ గురించి కొద్దిసేపు మాట్లాడారు. ఎన్నో మధురమైన పాటలను మనకు అందించినా ఎంతో Talent కలిగివున్న వ్యక్తి అయినా ఆయనకు తగిన గుర్తింపు రాలేదన్నారు (నా మాటగా చెప్పాలంటే పాటచాతుర్యమున్నా మాటచాతుర్యం లేక ఆయనకు ఎటువంటి పురస్కారాలు లభించలేదు). అటువంటి మహానుభావుని గౌరవార్థం ఈ వేడుక తలపెట్టినందుకు చిమట శ్రీనివాసరావును అభినందించారు. తరువాత ముఖ్యగాయకుడు, కార్యనిర్వాహకుడు అయిన రవి గుడిపాటి గారిని వేదికపైకి ఆహ్వానించారు.

రవి గుడిపాటి గారి గురించి ఒకమాట చెప్పాలి. నేను ఇంతకు ముందు ఆయన పాటల గురించి విన్నానుగాని, పాటలను మాత్రం వినియుండలేదు! ఆయన పాడుతుంటే కొన్ని సందర్భాలలో సాక్షాత్తు బాలుగారే వచ్చి పాడిన అనుభూతి కలిగింది. ఇకపోతే Orchestra గురించి కూడా నేనొక ముక్క చెప్పాలి. అందులోని వారందరూ (సత్య వైద్యనాథన్, వెంకీ సుబ్రమణియం, కృష్ణమూర్తి కల్వే, బాలాజి మహదేవన్, అశ్విన్ కుమార్, మరియు శ్రీనాథ్ విశ్వనాథన్) తమిళులు. మన సత్యం గారు కన్నడవారికి తెలుసుగాని తమిళులకు తెలియదు. వీరెవరికీ ఈ పాటలతో పరిచయం లేకపోయినా నెల రోజులలో అభ్యసించి చక్కని వాద్యం అందజేశారు.

మున్ముందుగా ఆనవాయతీ ప్రకారం భక్తిగీతంతో ప్రారంభించారు. 'అల్లరిపిల్లలు' చిత్రంనుండి '**శ్రీచక్ర శుభనివాసా, స్వామి జగమేలు చిద్విలాసా**' రవిగారు, యామిని పొట్టిగారు పాడితే మిగిలిన గాయినులు హేమ కోటా, సుధ శాస్త్రి, పద్మిని సరిపెల్ల గార్లు కోరస్ అందించారు.

తరువాత రవిగారు 'స్వప్న' చిత్రంనుండి '**అంకితం నీకే అంకితం**' అనే పాట చాలా అద్భుతంగా పాడారు. ముఖ్యంగా ఈ పాటలో 'కాళిదాసు కలమందు చిందు అపురూప దివ్యకవితా' వంటి అనేక కవితావాక్యాలు ఉంటాయి. వాటిని స్వరానికి తగ్గట్టుగా పాడితే చాలా వినసొంపుగా ఉండింది. పాట కరతాళ ధ్వనులతో ముగిసింది. ఈ పాట తరువాత ప్రసాద్ దుర్వాసుల గారు యామినిగారితో కలిసి '**ఏ రాగమో ఇది ఏ తాళమో**' అనే యుగళగీతం (చిత్రం అమరదీపం) ఆలపించారు.

గోదావరి తీరాన వెలిసిన రాజమహేంద్రి వైభవాన్ని వర్ణించడానికి వేయిమాటలు చాలవు కాని ఒక్క పాట చాలు. అదే ఆంధ్రకేసరి సినిమాలోని **'వేదంలా ఘోషించే గోదావరి, అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి'.** ఈ పాటను మురళి సంబర గారు వచ్చి అభినయిస్తూ పాడుతుంటే చిన్నప్పుడు చూసిన వరదగోదావరి పరవళ్లు

గుర్తుకొచ్చాయి. అప్పుడే రవిగారికి ప్రేక్షకులు enjoy చేస్తున్నారా లేదా అనే సందేహం కలిగింది! అందుకని ఒక హుషారైన మత్తెక్కించే పాట అందుకున్నారు. సుధ గారితో కలిసి బుల్లెమ్మ బుల్లోడు లోని **'కురిసింది వానా నా గుండెలోనా'** అని పాడి అందరి గుండెల్లో వానజల్లు కురిపించారు. ఈ పాటకు Orchestra వారు మంచి Drumbeat అందించారు.

తరువాయి పాటగా శాస్త్రీయసంగీతంలోని భూపాళరాగంలో కట్టబడిన **'తొలిసంధ్య వేళలో తొలి పొద్దు పొడుపులో'** (సీతారాములు చిత్రం) పాటను రవిగారు పాడితే హేమ, పద్మిని గార్లు రాగాలాపన చేశారు. ఈ పాటకు ఆయువుపట్టైన వేణుగానాన్ని (Flute) అశ్విన్ కుమార్ గారు చాలా బాగా వాయించారు. రవిగారు ఈ పాట పాడిన బాలు గారిని ఒకమారు తలుచుకున్నారు.

ఇంతవరకూ పాడిన పాటలన్నీ బాలుగారు పాడినవే. ఇప్పుడు రామకృష్ణగారు సుశీలగారితో కలిసి పాడిన భక్తకన్నప్ప చిత్రంలోని 'ఆకాశం దించాలా, నెలవంకా తుంచాలా' అనే శ్రావ్యమైన యుగళగీతాన్ని రవి తాతా గారు (ఇంకో రవిగారు), హేమగారు పాడారు. రవి తాతా గారి గొంతు రామకృష్ణ గారి గొంతుకు బాగా నప్పింది. ఈ పాటకు Orchestra సభ్యులందరూ చాలా కృషి చేసి చక్కని background music ఇచ్చారు.

తరువాత ఈ కార్యక్రమానికి Banner Song అయిన **'ఇది తీయని వెన్నెల రేయి'** (ప్రేమలేఖలు) పాటను ప్రసాద్ గారు, సుధ గారు కలిసి పాడుతుంటే (సమయం 7:15) బయట ఇంకా వెలుతురున్నా లోపల మాత్రం వెన్నెలరాత్రిలా అనిపించింది. అనంతరం ఇంకొక గాయకుడు మనకు పరిచయమయ్యారు. విజయ్ వేమూరి గారు యామిని గారితో కలిసి పాడిన మాయామశ్చీంద్ర లోని **'ప్రణయరాగ వాహినీ.. చెలీ వసంతమోహినీ'** అనే మధురగీతం కరతాళధ్వనులతో ముగిసింది.

బాలుగారు స్వయంగా చెప్పిన, తనకు మొట్టమొదటి సారి చాలా పేరు తెచ్చిపెట్టిన పాట. కన్నెవయసు సినిమాలోని **'ఏ దివిలో విరిసిన పారిజాతమో'** పాటను రవి (గుడిపాటి) గారు పాడారు. ఈ పాటకు ముఖ్యమైన Base Guitar ను వాయించినది సాలూరి వాసురావుగారని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు! ఇప్పుడు ప్రేక్షకులకు బాగా హుషారు పుట్టించాలని Agent Gopi సినిమానుండి **'ఓ.. హంస బలె రామచిలుకా ఒలమ్మీ'** అంటూ హేమగారు, మురళిగారు ముందుకొచ్చారు. ఇతర గాయినులు కోరస్ అందించారు. వేదికమీద మురళిగారు వేసిన అడుగులకు అనుగుణంగా ప్రేక్షకులు కూడా తాళం వేశారు. ఈ పాట పూర్తి కాగానే రవి తాతా గారు **'ఇదే పాటా ప్రతీచోటా ఇలాగే పాడుకుంటా'** నంటూ వచ్చారు. పుట్టినిల్లు-మెట్టినిల్లు చిత్రంలోని ఈ పాటకు ఒక ప్రత్యేకత ఉంది. తెరమీద శోభన్ బాబు గారు పాడుతుంటే సాక్షాత్తూ సత్యం గారే కనిపించి Orchestra అందజేస్తారు! సత్యంగారు తెరమీద కనిపించే సినిమా నాకు తెలిసినది ఇది ఒక్కటే.

రవిగారు మళ్లీ వేదికపైకి వచ్చి యామినిగారితో కలిసి తోటరాముడు సినిమానుండి **'ఓ బంగరు రంగుల చిలుకా పలుకవే'** పాటను పాడారు. ఈ పాట పూర్తి కాగానే ఆయన కొద్దిసేపు మాట్లాడారు. ముందుగా Orchestra సభ్యులందరినీ పరిచయం చేసి తమిళులైనా నెలరోజుల్లో వారు ఇన్ని తెలుగుపాటలకు మంచి సంగీతం అందిస్తున్నందుకు వారినందరినీ అభినందించారు. ఆ తరువాత చిమట శ్రీనివాసరావుగారు సంగీత అభిమానులకు తన మ్యూజిక్ వెబ్ సైట్ ద్వారా చేస్తున్న సేవను కొనియాడుతూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి బాగా 'చెమటోడ్చి' కష్టపడ్డారని చమత్కరించారు.

అనంతరం రవిగారు స్వప్న సినిమానుండి **'ఇదే నా మొదటి ప్రేమలేఖ'** అనే ప్రేమగీతాన్ని ఆలపించారు. స్వప్న సినిమాకు రాజ్ కపూర్ గారి Sangam మాతృక. ఆ సినిమాలో శంకర్-జైకిషన్ ల సంగీతదర్శకత్వంలో రఫీ పాడిన यह मेरा प्रेमपत्र पढकर పాట, చాలా అద్భుతమైన పాట, చాలామందికే గుర్తుండి ఉంటుంది. శంకర్-జైకిషన్ లతో సత్యంగారికి చాలా స్నేహానుబంధం ఉందని బాలుగారు తరచుగా బాలుగారు ఉటంకిస్తూ ఉంటారు. ఆ హిందీపాటకు ఆ సంగీత దర్శకులకు ఏమాత్రమూ తీసిపోకుండా ఈ తెలుగుపాటను సత్యంగారు కంపోజ్ చేశారు.

విరామసమయం ఆసన్నమయింది. విజయగారు మరలా వేదికపైకొచ్చి చిమట శ్రీనివాసరావుగారిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. శ్రీనిగారు తనకు పాతపాటలపై గల మమకారాన్ని అందరితో పంచుకున్నారు. అంచనాలను మించి మొత్తం వేయివరకు ప్రేక్షకులు వచ్చారని, ఇది నిజంగా పాతపాటలకు పట్టాభిషేకమేనని సగర్వంగా విన్నవించుకున్నారు.

విరామానికి ముందుగా బాలుగారి Video ను ప్రదర్శించారు. ఈ వీడియో ChimataMusic.com లో ఉంది. ఇది తప్పకుండా వినవలసిందే/చూడవలసిందే!. సత్యంగారితో పనిచేయడం నిజంగా తన అదృష్టమేనని ప్రస్తావించారు. విరామానికి తరువాత వాసురావుగారి Video ను ప్రదర్శించారు. సత్యంగారికి పిల్లలు లేరని కాని అయన బాలుగారిని పెద్దకొడుకుగాను తనను చిన్నకొడుకుగాను భావించేవారని అన్నారు. మన శాస్త్రాలలో చెప్పబడిన గురుశిష్య పరంపరంటే బహుశా ఇదేనేమో.

రెండవభాగం ప్రారంభం కావడానికి ముందర మరొక చిన్న ఘట్టం ఉండింది! సభలోనే ఉన్న నటుడు, కవి అయిన శ్రీ అక్కిరాజు రామకృష్ణారావు గారిని వేదికపైకి రావలసిందిగా విజయగారు ఆహ్వానించారు. ఒక తేటగీతి పద్యరూపంలో సత్యంగారిని ఈ క్రింది విధంగా ప్రసంశించారు:

అరయ స్వర్గంగతూగు సత్యంబుగాదొ
అర్థి అలసొంపు నడక సత్యంబుగాదొ
అరయ జీమూత గర్జ సత్యంబుగాదొ

అర్థి భ్రమరంబు రుతియు సత్యంబుగాదో

రెండవభాగంలో మొట్టమొదటగా మురళిగారు, సుధగారు కలిసి సీతారాములు చిత్రంనుండి **'పలికినది పిలిచినదీ.. పరవశమై నవమోహనరాగం'** పాడారు. తరువాత రవి హేమ గార్లు కలిసి దొంగలకు దొంగ నుండి **'ఒకటే కోరిక నిన్ను చేరాలని'** అంటూ ప్రేక్షకులను హుషారెక్కిస్తూ పాడారు. ఈ పాటకు అవసరమైన fast drumbeats అద్భుతంగా కుదిరాయి.

యామినిగారు రవి తాతాగారితో కలిసి **'తొలివలపే తీయనిది'** అంటూ ఆలపించారు. ఈ పాట తదుపరి రవి గుడిపాటి గారు యేసుదాసు పాడిన **'గాలివానలో వాననీటిలో పడవ ప్రయాణం'** (స్వయంవరం చిత్రం) పాడారు. ఈ పాటను బాలు పాడియుంటే ఎలాగుంటుందో తెలుసుకోవాలనుకుంటే రవిగారు పాడిన ఈ పాట వింటే తెలుస్తుంది!

హేమగారు బాల్యమిత్రుల కథ లోని **'గున్నమామిడి కొమ్మమీద'** అంటూ అచ్చు జానకిగారే పాడినట్లుగా పాడారు. పద్మిని, యామిని గార్లు వెనుకనుండి కోరస్ అందించారు. అందుకు ఏ మాత్రం తీసిపోకుండా యామినిగారు **'రాధకు నీవేరా ప్రాణం'** అంటూ తులాభారం సినిమానుండి పాట పాడారు.

తరువాత మురళి గారు హేమగారితో కలిసి **'సన్నాజాజికి, గున్నామామికి పెళ్లి కుదిరింది'** పాడారు. ఈ పాటకు అత్యంత అవసరమైన ఢోలక్ వాద్యాన్ని బాలాజి మహదేవన్ ప్రత్యేకంగా వాయించారు. పాటలు బాగున్నాయా? మరి చప్పట్లు వినిపించటంలేదేం?? అని రవిగారు చమత్కరించారు. అటుపిమ్మట రవి తాతా గారు సుధగారు కలిసి నోము సినిమాలోని **'కలిసే కళ్లలోనా మెరిసే పూలవానా'** అని పాడారు. ముఖ్యంగా సుధగారు ఈ పాటను చాలా బాగా పాడారు. తరువాయి పాట కార్తీకదీపం చిత్రం లోని **'నీ కౌగిలిలో తలదాచి'** ని యామినిగారు రవిగారు ఒకరిని మించి ఒకరు పాడారు. అచ్చం జానకిబాలు గార్లు పాడినట్లే ఉంది. పూలకొమ్మ ఆడింది, కోయిలమ్మ పాడింది.. మరి పైడిబొమ్మ కనబడదేం? అని ప్రశ్నిస్తూ విజయ్ గారు ముందుకొచ్చి అందమే ఆనందం సినిమాలోని **'మధుమాస వేళలో మరుమల్లె తోటలో'** అనే విరహగీతం ఆలపించారు. రవిగారు సుధగారితో గొంతుకలిపి **'తొలిసారి ముద్దివ్వమంది చెలిబుగ్గ చేమంతిమొగ్గ'** అనే పాట (ఎదురీత) సినిమాలోనిది పాడారు.

చిట్టచివరిగా రవిగారు ప్రేక్షకులను ఒక ఊపు ఊపుతూ అన్నదమ్ముల సవాల్ లోని **'నా కోసమే నీవున్నది ది ది'** పాటను పాడారు. పాటకు ముందర ప్రేక్షకులలో కృష్ణ అభిమానులెవరైనా ఉన్నారా? అని ఒక సవాల్ కూడా విసిరారు!

విజయగారు వేదికపైకొచ్చి ముగింపు ప్రసంగం చేశారు. చిమట శ్రీని కూడా అందరికీ ధన్యవాదాలు తెలిపి ఇంకొక ఆరు నెలలలో కే.వీ.మహదేవన్ గారి పాటలపై ఇంకొక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

చివరిగా శ్రీలు వెలిగేటి (బాటా వైస్- ప్రెసిడెంట్) సంగీత కచేరి కి ముందుగా జరిగిన సత్యం గారి పాటల పోటీలలో నెగ్గిన విజేతలందరికీ బహుమతులు ప్రధానం చేశారు. సన్నిధి రెష్టారెంట్ వారు విజేతలందరికీ ఉచిత కూపన్లు అందజేశారు.  ప్రసాద్ మంగిన ఈ కార్యక్రమం లో అలుపెరగక పని చేసిన బాటా కమిటీ మెంబర్లకు మరియు చిమటమ్యూజిక్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.